క్లుప్తంగా

శాంతిభద్రతలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎస్ఐ మల్లికార్జున

గోస్పాడు: గ్రామాల్లో శాంతి భద్రతలపై దృష్టి సారించాలని ఎస్ఐ మల్లికార్జున మహిళా పోలీసులకు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి సెల్‌ఫోన్లలో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

శిరివెళ్ల: మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను మంగళవారం ఎక్సైజ్ అధికారుల తనిఖీ చేశారు. నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో గోవిందపల్లె, యర్రగుంట్ల మద్యం దుకాణాలను తనిఖీ చేసి మద్యం నిల్వలు, ధరల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లావాదేవీలన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. తనిఖీల్లో సబ్ఇన్‌స్పెక్టర్ అస్లాంబేగ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



దేవతా మూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని డి.కొట్టాలలో ఉన్న రామాలయం, శివాలయం, గంగమ్మ ఆలయాల్లో ప్రతిష్ఠోత్సవాలు శాస్త్రోత్సంగా సాగుతున్నాయి. నాలుగు రోజులుగా గ్రామంలోని ఆలయాల వద్ద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. నియమ నిష్టలతో హోమ గుండాల వద్ద విశేష పూజలు చేశారు. మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో పండితులు నూతన కలశం, రామ, లక్ష్మణ, సీతమ్మ, గంగమ్మ, శివలింగం తదితర దేవతా మూర్తులను ట్రాక్టరులో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సాగు రైతులకు పట్టాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(అర్బన్): దశాబ్దాలుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గడివేముల మండలం కొర్రపోలూరు గ్రామ రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లాకార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్‌లు కోరారు. సీపీఐ నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొర్రపోలూరు గ్రామంలో 600 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని, కొన్నేళ్లుగా పేద రైతులు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వాటికి పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, సోమన్న, ప్రతాప్ ఉన్నారు.

పాండురంగస్వామికి సహస్ర నామార్చనలు



నంద్యాల(అర్బన్): పాండురంగాపురంలో వెలసిన రుక్మిణి సమేత పాండురంగస్వామికి సహస్ర నామార్చనలు నిర్వహించారు. అంతకుముందు పాల్గున శుద్ధ నవమిని పురస్కరించుకుని దుర్గా సూర్త, శ్రీసూర్త అభిషేకాలు, అర్చన హారతులు, మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వితరణ, ఫల ప్రధానములు నిర్వహించారు. సాయంత్రం అన్నాభిషేకాలు, సహస్ర నామార్చానలు, హోమాలు, హారతి, తీర్థప్రసాద వినియోగములు, ఫలప్రదానముల అనంతరం స్వామి వారి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. అలాగే రుక్మిణి అమ్మవారు, పార్వతి దేవి, శివుడు, వీరభద్రుడు, నాగేంద్రుడు, గణపతి దేవుళ్లను అలంకరించి పూజలు నిర్వహించారు.

సొంతింటి కలకు డ్వాక్రా సాయం

- గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడమే లక్ష్యం
- లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం
- స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.35 వేల రుణం
- జిల్లాలో 45,958 మందిలో ఇప్పటికే 23,301 మంది మహిళలకు ఆర్థిక సాయం

పేదల సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అధికారులకు లక్ష్యాలను సైతం నిర్దేశించింది. ఇందులో భాగంగా నిర్మాణాకి ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోకపోతే.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు డీఆర్డీఏ కింద రూ.35 వేల రుణం పావల వడ్డీకే ఇస్తుంది. ఈ మొత్తం కూడా సరపడకపోతే.. ఉన్నతి పథకం వర్తించే ఎస్సీ,ఎస్టీ,బీసీలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు సున్నా వడ్డీ కింద రుణం అందజేస్తుంది.



శిరివెళ్ల జగనన్న కాలనీలో నిర్మాణంలోనున్న ఇళ్లు

నంద్యాల: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చడానికి పూనుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయా గ్రామాలు, పట్టణాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలకు అనుమతిచ్చింది. అయితే నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేలా పలు చర్యలు చేపట్టింది. సాధారణంగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు అందజేస్తుంది. ఈ సాయం సరిపోకపో తే మరింత సొమ్ము అందజేయాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారులకు మరింత ఆర్థిక వెసులుబాటు కల్పిస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ త్వరలో వారితో గృహ ప్రవేశం చేయించాలని నిర్ణయించింది.

ప్రత్యేక చర్యలు..

జిల్లాలో పక్కా ఇళ్ల నిర్మాణ పనులను ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. అధికారులు సైతం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. వారంలో ఒక రోజు గృహ నిర్మాణాల పరిశీలనకు కేటాయించారంటే ఎంత చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందో అర్థం చేసుకోవచ్చు. అలాగే డీఆర్డీఏ, మెప్మా ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అదనపు రుణాలు మంజూరు చేస్తోంది.

‘ఉన్నతి’ ద్వారా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణం..

పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి ప్రభుత్వం ముందుగా రూ.1.80 లక్షలు అందిస్తుంది. ఈ డబ్బులు సరిపోకపోవడంతో మరింత సాయాన్ని రుణంగా మంజూరు చేస్తుంది. అందులో భాగంగా డ్వాక్రా మహిళలకు తొలుత రూ.35 వేలను పావలా వడ్డీకే రుణం అందజేస్తుంది. ఇది కూడా సరిపోకపోతే రెండో విడతగా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బ్యాంకు నుంచి రుణం తీసుకునేందుకు అనుమతిస్తుంది. ఈ క్రమంలో ఉన్నతి పథకం వర్తించే ఎస్సీ,ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు సున్నా వడ్డీకే రుణాలు అందిస్తోంది.

రూరల్ పరిధిలో 12,594 మంది..

జిల్లా వ్యాప్తంగా రూరల్ పరిధిలో 33,164 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. తొలుత ప్రభుత్వం అందించిన రూ.1.80 లక్షలు సరిపోకపోవడంతో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులు 17,075 మంది రూ.35 వేలు రుణం కోసం దరఖాస్తు చేసుకోగా వీరందరికీ డీఆర్డీఏ ద్వారా రూ.59.76 కోట్లు మంజూరు చేశారు.

అర్బన్ పరిధిలో...

ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నందికొట్కూరు, నంద్యాల మున్సిపాలిటీల్లో 12,594 మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయి. అయితే వీరిలో ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలు కాకుండా మరో రూ.35 వేలు మంజూరు చేయాలని 6,125 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి డీఆర్డీఏ ద్వారా రూ.21.41 కోట్లు మంజూరు చేశారు.

సకాలంలో పూర్తి చేయడమే లక్ష్యం



జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందు కోసం పకడ్బందీ చర్యలు చేపట్టాం. డీఆర్డీఏ ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహకారం అందిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికే గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–శ్రీధర్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ, నంద్యాల

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ఆళ్లగడ్డ: మార్చి 1 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. చాగలమర్రి పశువైద్యశాలలో మంగళవారం పశువైద్యాధికారులు, సిబ్బందితో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత టీకాల కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో చేపడతామన్నారు. నెల రోజుల పాటు సాగనున్న ఈ కార్యక్రమాన్నిపశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపటి తరానికి పునాది ‘భవిష్య’



మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి

నంద్యాల(అర్బన్): గ్రామీణ విద్యా వికాసానికి బొజ్జా వెంకటరెడ్డి అగ్రికల్చర్ ఫౌండేషన్ అందిస్తున్న భవిష్య కార్యక్రమం రేపటి తరానికి పునాది అని మానసిక వికాస సంస్థ మెంటా మైండ్స్ వ్యవస్థాపకులు గజ్జల రవీంద్రారెడ్డి అన్నారు. పోలూరు, బలపనూరు గ్రామాల్లోని జెడ్పీహెచ్ పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం భవిష్య కార్యక్రమంలో భాగంగా వ్యక్తిత్వ వికాసంతో పాటు పలు అంశాలపై గజ్జల రవీంద్రారెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కిరణ్, నారాయణ, అధ్యాపకులు, విశ్రాంత ఎంఈఓ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

జగజ్జననీ దేవికి సహస్ర కలశ క్షీరాభిషేకం



అమ్మవారికి అభిషేకాల కోసం క్యూలో ఉన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక జగజ్జననీ అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారికి సహస్ర కలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచే ఆవు పాలు, కలశాలతో వచ్చి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పుడమికి పచ్చందం



కనుచూపు మేర పచ్చగా కళకళలాడుతున్న వరి పైరు

శిరివెళ్ల: మండలంలో రబీలో వరి పంట అధికంగా సాగైంది. ప్రస్తుతం పైరు పచ్చగా కళకళలాడుతుండటంతో కనుచూపు మేర పుడమి పచ్చదనం పులుముకున్నట్లు ఎంతో ఆహ్లాదాన్నిస్తోంది. ప్రస్తుతం పంట వేసి నెల గడిచింది. మండలంలో రబీలో వరి సాధారణ విస్తీర్ణం 4,725 ఎకరాలు కాగా అందుకు మించి 6,455 ఎకరాలలో సాగైంది. అత్యధికంగా శిరివెళ్లలో 1834 ఎకరాలు, కోటపాడు 874, యర్రగుంట్ల 842, గంగవరం 774, వనికిదినిదిన్నె 492, చెన్నూరు 432 , గోవిందపల్లె 338, కామినేనిపల్లె 139, గుంప్రమాన్‌దిన్నె 14 ఎకరాలు, జీనేపల్లె 32, మహదేవపురంలో 174 ఎకరాల్లో వేశారు. మార్చి నెలాఖరు వరకు కాల్వలకు సాగు వస్తే పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

- మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా
- రూ.69.71 కోట్లతో నంద్యాల మున్సిపాలిటీ బడ్జెట్ రూపకల్పన

అభివృద్ధి చేసి చూపిస్తాం





సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దేందుకు ప్రభు త్వం చర్యలకు ఉపక్రమించిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలకు భిన్నంగా పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. 2023–24 సంవత్సరానికి రూ. 69.71 కోట్లతో అభివృద్ధికి ఊతమిచ్చేలా కేటాయింపుల చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీకి వచ్చే రాబ డులు, వ్యయాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందించామన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.54.73 కోట్లను ప్రతి పాదించగా రూ. 57.73 కోట్ల రూపాయలు రివైజ్డ్ బడ్జెట్ కింద ఖర్చు చేయడం జరిగిందన్నారు. రానున్న ఆర్థి క సంవత్సరం 2023–24లో రూ.2.92 కోట్ల మిగు లుపొందడానికి ప్రణాళికలు తయారు చేశామన్నారు.

బడ్జెట్‌లో ప్రతిపాదించిన వ్యయాలు..

పట్టణంలోని సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.12.20 కోట్లను వ్యయం చేయనున్నారు. తాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.4.70 కోట్లు మూల ధన వ్యయంలో వెచ్చించనున్నారు. ఇతర వేజెస్ కోసం రూ.15.25 కోట్లు, ఎలక్ట్రిసిటీకి రూ.5.75 కోట్లు, ఫ్యూయల్‌కు రూ.1.53 కోట్లు వెచ్చించనుండగా నీటి సప్లై మెయింటెనెన్స్‌కు రూ.1.10 లక్షలు వ్యయాన్ని బడ్జెట్‌లో పేర్కొన్నారు. సచివాలయాల అద్దెల కోసం రూ.43.50 లక్షలు, అమృత్ పథకం లోన్‌పై వడ్డీ రూ.7.06 కోట్లు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.8.96 కోట్లు వెచ్చించనున్నట్లు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేశారు. కౌన్సిల్ సభ్యులంతా బడ్జెట్ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. చిన్నాసుపత్రికి బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదని కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా సభ దృష్టికి తీసుకురాగా.. ఆసుపత్రుల నిర్వహణకు, ఇతరత్రాల కోసం వెచ్చించిన నిధుల్లో నుంచే ఖర్చు చేస్తామని మున్సిపల్ కమిషనర్ సమాధానమిచ్చారు. సమావేశంలో కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షాదిక్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, డీఈఈలు జయభారత్‌రెడ్డి, మధుకుమార్, శ్రీనివాసరెడ్డి, ఆర్ఓ వరప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పీడీ యాక్ట్

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన హరిలింగంపై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాలు.. హరిలింగం కొంత కాలంగా నాటు సారా తయారు చేస్తూ సామాన్యులకు విక్రయిస్తూ వారి ఆరోగ్యాలకు హాని కలిగిస్తున్నాడు. పలు మార్లు కేసు నమోదు చేసి జైలుకు పంపినా మార్పు లేకపోవడంతో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ దృష్టికి తీసుకెళ్లగా వారి ఆదేశాలతో మంగళవారం హరిలింగంపై పీడీ యాక్ట్ నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పుట్టాలమ్మకు రూ.14.51 లక్షల ఆదాయం

ఆళ్లగడ్డ: రామతీర్థ పుట్టాలమ్మకు హుండీ కానుకల ద్వారా రూ.14.51 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ సాయి జయచంద్రారెడ్డి తెలిపారు. భక్తులు హుండీలలో వేసిన కానుకలను మంగళవార ఆలయ ప్రాంగణంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. పుట్టాలమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.11,92,133, అన్నదానం హుండీ ద్వారా రూ.46,685, లక్ష్మీనరసింహ స్వామి ఆలయం హుండీ ద్వారా రూ.212456లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగారెడ్డి, గంగుల రామిరెడ్డి, గ్రామస్తులు రామకృష్ణారెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రిలో మంగళవారం పశుగ్రాసం దగ్ధమైంది. అడ్డవాగు సెంటర్ నుంచి ఈద్గాకు వెళ్లే రహదారిలో మహమ్మద్‌గౌస్ తన కళ్లంలో గడ్డి వాము వేసుకునేందుకు అవసరమైన జొన్న చొప్ప, వరి గడ్డి, కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నాడు. ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగడంతో ప్రజలు గమనించి బాధితుడికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు అదుపు చేసింది. ప్రమాదంలో సుమారు రూ.30 వేలు నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఘనంగా నేషనల్ సైన్స్ డే వేడుకలు



కేశవరెడ్డి పాఠశాలలో సైన్స్ ఫేర్‌లో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం)/(అర్బన్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు కళాశాలలో, పాఠశాలల్లో దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల నందు మంగళవారం నేషనల్ సైన్స్‌డేను కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్, ర్యాష్ డ్రైవింగ్, అనవసరమైన కలహాలతో సమయాన్ని వృథా చేసుకోకుండా సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రయోగాలపై దృష్టి సారించాలన్నారు అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులను ప్రారంభించి తిలకించారు.

ప్రైవేటు పాఠశాలల్లో..

బాలాజీ కాంప్లెక్స్‌లోని కేశవరెడ్డి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత నాగినిరెడ్డి కేశవరెడ్డి మాట్లాడుతూ స్వయంగా తయారు చేసిన ప్రదర్శన వల్ల సృజానాత్మకత ఆలోచన, మేథాశక్తి పెరుగుతుందన్నారు. అలాగే గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ యోగీశ్వరరెడ్డి, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి..

సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యురాలు రాజేశ్వరమ్మ సూచించారు. స్థానిక నందమూరి నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయంలో సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. రాజేశ్వరమ్మ మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న మేథాశక్తిని బయటకు తీసి వారి ఉజ్వల భవిష్యత్తు బాటలు వేయడమే సైన్స్ దినోత్సవ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి గడ్డం సుబ్బరాయుడు, నిర్వాహకులు నాగలక్ష్మి, లక్ష్మిదేవి, రాజు, హుసేన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

ఉయ్యాలవాడ: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ నూర్జహాన్, అధ్యాపకులు వెంకటరమణ తదితరులు ప్రదర్శనలను పరిశీలించారు. ఇలాంటి ప్రదర్శనల వల్ల సృజనాత్మకత మెరుగుపడుతుందన్నారు.

యర్రగుంట్లలో..

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. సైన్స్‌పై విద్యార్థులకు క్విజ్ ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీఐ ప్రభాకర్‌రెడ్డి



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్ విద్యార్థినులు తయారు చేసిన కిడ్నీ నమూనాను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్



బహుమతులు పొందిన విద్యార్థులతో రాజేశ్వరమ్మ

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ఏపీ మోడల్ స్కూల్ జేడీ వెంకటకృష్ణారెడ్డి

ఆళ్లగడ్డ: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తయారు చేయాలని ఏపీ మోడల్ స్కూల్స్ జేడీ వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల, హాస్టల్‌లోని వసతులు, సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓ శోభావివేకవతి ఉన్నారు.

నంద్యాల(సిటీ): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని జేడీ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక క్రాంతి నగర్‌లోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. జేడీ వెంట ఎంఈఓ బ్రహ్మం నాయక్ ఉన్నారు.

రక్తహీనతపై జాగ్రత్తగా ఉండాలి

గోస్పాడు: రక్తహీనత పట్ల జాగ్రత్తగా ఉండాలని డాక్టర్లు గోపాల్ సూచించారు. మండలంలోని జూలేపల్లె, ఎం.చింతకుంట్ల గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారు సరైన మందులు వాడాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా గ్రామాల్లో నెలకు రెండుసార్లు పర్యటిస్తామన్నారు. క్యాంపు వద్దకు రాలేని పేషెంట్లకు ఇంటి వద్దనే వైద్యసేవలు అందిస్తామన్నారు. రెగ్యులర్‌గా వచ్చే రోగులతో పాటు కొత్తగా గ్రామాల్లో అనారోగ్యానికి గురైన వారి వివరాలు సేకరించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు.